కర్షకుడికి అండగా కియోస్క్

- ఈ యంత్రాలతో రైతులకు సమగ్ర సమాచారం
- ఇంటి ముంగిటకు పలు సేవలు
- విత్తనాలు, ఎరువులు ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం
- అందుబాటులోకి సమగ్ర సమాచారం



పెద రాయవరం గ్రామంలో కియోస్క్ ద్వారా రైతులను సమాచారం వివరిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

రంగంపేట: రైతు సంక్షేమమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేసింది. సాగును సంబరంగా మార్చేందుకు విశేషంగా కృషి చేసింది. అందులో భాగంగా అన్నదాతలకు కియోస్క్ యంత్రాలను ఆర్బీకేల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. భూసార పరీక్ష నుంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను పల్లెముంగిటకే చేర్చింది. అలాగే ఈ యంత్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులను ముందస్తుగా బుక్ చేసుకునే వెలుసుబాటు కల్పించింది. పండించిన పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు సహకారం అందించింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. రైతు సంక్షేమం కోసం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసే అన్న దాతలు అధిక దిగుబడి సాధించేందుకు సహకారం అందించారు. అందులో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఈ క్రమంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందేందుకు కియోస్క్ యంత్రాలను తీసుకువచ్చారు.

అందుబాటులో సమాచారం

రైతు భరోసా కేంద్రాలలో డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగ శాలల సమాచారం అందుబాటులో ఉంచారు. ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలి. దానికి సంబంధించిన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు గురించి తెలుసుకోవచ్చు. అలాగే పశువులకు వచ్చే రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు కియోస్క్ యంత్రం ద్వారా తెలుస్తుంది

తప్పిన దళారుల బెడద

గతంలో రైతులు పండించిన పంటకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలియక రైతులు ఇబ్బందులు పడి దళారుల చేతిలో మోసపోయేవారు. కాని ఆ పరిస్థితి లేకుండా కియోస్క్ ద్వారా సమీపంలోని కొనుగోలు కేంద్రాల సమాచారం లభిస్తుంది.

వాతావరణ సమాచారం

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. రైతు భరోసా కేంద్రాల పరిధిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దానికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

ముందస్తు బుకింగ్...

కియోస్క్ యంత్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, పంటల కొనుగోలు వంటి సమాచారం తెలుసుకోవచ్చు. ఎరువులు, పురుగు మందులను ముందస్తుగా బుకింగ్ చేసుకోవచ్చు.

రాజానగరం, అన పర్తి నియోజకవర్గాల్లో...

రాజానగరం నియోజక వర్గం మూడు మండలాల్లో 71 రైతు భరోసా కేంద్రలు ఉన్నాయి. సీతానగరం మండలంలో 20, కోరుకొండ మండలంలో 24, రాజానగరం మండలంలో 27 ఆర్బీకేలు ఉండగా, 64 కియోస్క్‌లు ఉన్నాయి. అనపర్తి నియోజక వర్గం నాలుగు మండలాల్లో 80 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. అనపర్తి మండలంలో 20, పెదపూడ మండలంలో 20, బిక్కవోలు మండలంలో 21, రంగంపేట మండలంలో 19 ఆర్బీకేలు ఉండగా 79 కియోస్క్‌లు ఉన్నాయి. వీటి ద్వారా స్థానిక రైతులకు వ్యవసాయ అధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలు సమగ్రమైన సమాచారం వివరిస్తున్నారు.

అన్ని రకాల సేవలు



రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. దీని ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థిక ప్రగతి సాధించవచ్చు. గ్రామ స్థాయిలో అన్ని రకాల సేవలు లభించడంతో రైతులు సంతోషంగా ఉంటున్నారు.

– కె. శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అశ్విని ఎంపిక



విద్యార్థి అశ్వినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదపూడి: అనపర్తిలో బాలికోన్నత పాఠశాల విద్యార్థి జి. అశ్విని స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల హెచ్ఎం కల్యాణి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ ఈ నెల 21న కాకినాడలోని డీఎస్ఏ గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అశ్విని ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఆమె రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఆమెను పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ప్రతినిధులు అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి స్కూల్ గ్రేమ్స్ ఎంపికైన మెళ్లూరు క్రీడాకారులు

బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గం స్థాయి స్కూల్ గ్రేమ్స్‌లో మెళ్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి స్కూల్ గ్రేమ్స్‌కు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం లక్ష్మి తెలిపారు. సోమవారం మెళ్లూరు ఉన్నత పాఠశాల వద్ద ఎంపికైన విద్యార్థులు దూళ్ళ సూర్యచంద్ర వెంకట రత్నకర్, శీలం లీలా మహీధర్, కొమ్మన సాయిరాం చరణ్, అప్పన్నబాబు, బచ్చల ధరణి, శీలా శ్రీనివాస్, చల్లా సత్యనారాయణ, కొమ్మన దివ్య శివకృష్ణ వీర్లనిలను అభినందించారు. ఈ కార్యక్రమంలోని పీడీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో మెగా వైద్య శిబిరం



చినపాలమూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తిలో రామిరెడ్డి మంగయమ్మ కళావేదిక వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు, 60 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులకు మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం డాక్టర్లు, పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అలాగే అనపర్తి మండలం చినపోలమూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర 2047 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.


శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



కరకుదురులో రాట వేస్తున్న గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదపూడి: ఈ నెల 12న జరిగే విజయదశమి, శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించి కరకుదురు గ్రామంలో కనకదుర్గదేవి అమ్మవారి ఆలయం వద్ద సోమవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ముందుగా గణపతి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు చక్రపాణి, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. గత 30 ఏళ్లగా అమ్మవారికి నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సానా శ్రీను, తోటకూర శ్రీను, బుజ్జి, అడపా శ్రీనివాసు, బద్దాల శివరామకృష్ణ, చోడిశెట్టి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు



చంద్రేడులోని చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మధురపూడి రహదారిలో పనులు చేస్తున్న విమానాశ్రయ ఉద్యోగులు



సంపరలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మావతి

మధురపూడి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ప్రజారోగ్యం లభిస్తుందని రాజమహేంద్రవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం కోరుకొండ మండలం బూరుగుపూడి నుంచి మధురపూడిలోని విమానాశ్రయం వరకూ ఉన్న రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకూ 15 రోజుల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలోభాగంగా విమానాశ్రయం ఆవరణలో వెయ్యి మొక్కలు నాటామన్నారు. అలాగే ఈనెల 25వ తేదీన విమానాశ్రయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. స్కూల్ పిల్లలతో కూడా మొక్కలను నాటిస్తామని తెలిపారు. సంవత్సరంలో 100 గంటలు చొప్పున వారానికి 2 గంటలు పాటు స్వచ్ఛత కోసం పనిచేయాలన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. విమానాశ్రయంలోని ఎస్‌పీఎఫ్, పోలీసులు, ఎయిర్‌లైన్స్, వివిధ విభాగాలకు చెందిన 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

సంపరలో 'స్వచ్ఛతా హీ సేవ'

పెదపూడి: ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సంపర సెక్టార్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ, పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ అందరికీ సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పోషకాహార పదార్థాలు తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎన్డీఏ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో ఎండాకు తెగులు నివారణ



పాలమూరులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి సురేష్‌కుమార్

పెదపూడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరికి ఎండాకు తెగులు వ్యాపించే అవకాశం ఉందని, రైతులు వ్యవసాయశాఖ అధికారులు సూచనలు సలహాలు పాటించాలని అనపర్తి మండల వ్యవసాయశాఖ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. పాలమూరు గ్రామంలో గ్రామ వ్యవసాయ సహకుడు కె.రాజేష్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఏవో సురేష్‌కుమార్ మాట్లాడుతూ వరి పొలంలో ఎక్కువగా ఎండాకు తెగులు కనిపిస్తుందన్నారు. దీనిని బాక్టీరియల్ లీఫ్‌బ్లెట్(బీఎల్‌బీ) అని పిలుస్తారన్నారు. ప్రస్తుతం వరి పొలం ఈనిక దశకు చేరుకుందని, ఎండాకు తెగులు ఆశించిన పొలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే పిలకలు ఎండిపోయి వెన్నులు సరిగా రాకపోవడం లేదా తాలు గింజలు ఏర్పడతాయని తెలిపారు. దీనిపై రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగులు నివారించుకోవాలన్నారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాల దృశ్యం

రాజానగరం: పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీరాజా కాండ్రేగుల బహుదూర్ పంతులు అన్నదాన సత్రం ఏరియాలోని కల్యాణ మండపంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రాజానగరం ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహారం ఆవశ్యకతను, తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే విధానాన్ని, ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అవగాహన కలిగించారు. అలాగే బేటి బచావో, బేటీ పడావో పై అవగాహన కలిగించడంతోపాటు విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాపరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్‌కె దుర్గామణి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

రంగంపేట: మండలంలో రెండు రోజుల పాటు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వచ్చే శనివారం ఉదయం మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలోను, మధ్యాహ్నం రంగంపేట గ్రామంలోను పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే బుధవారం ఉదయం చంద్రేడు, మధ్యాహ్నం పెదరాయవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రైతులు, గ్రామ పెద్దలు, నాయకులు హాజరుకాలన్నారు.

డ్రోన్ ద్వారా పురుగు మందుల స్ప్రే

మధురపూడి: వ్యవసాయ శాఖలోని ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగు మందులను స్ప్రే కార్యక్రమాన్ని సోమవారం బూరుగుపూడిలో నిర్వహించారు. అధికారులు గ్రామంలోని పదెకరాల విస్తీర్ణంలో వరి పొలాల్లో స్ప్రేంగిన్‌ను చేపట్టారు. వ్యవసాయశాఖ ఏడీ బి. మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో వ్యవసాయ పనులు చేయవచ్చనారు.

ఘనంగా గంగాలమ్మ జాతర



సీతానగరంలో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

సీతానగరం: గ్రామంలోని లంకలో ఉన్న గంగాలమ్మ అమ్మవారి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. రామదుర్గ వడ్డీర సంఘం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. లంకూరులోని రామదుర్గ వడ్డీర సంఘం వారు గంగాలమ్మ అమ్మవారికి తెప్ప కట్టి గ్రామంలో ఘనంగా ఊరేగించారు. తీన్‌మార్ డప్పులు, నృత్యాలు, బాణసంచా కాల్పులతో ఆనందంగా అమ్మవారిని ఊరేగించి, గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక ఎస్సై రామ్‌కుమార్ ఎటువటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి



కొంకుదురులో విద్యార్థులకు వివరిస్తున్న మానవత వ్యవస్థాపకులు శ్రీనివాస్ చౌదరి

బిక్కవోలు: విద్యార్థులు ప్రకృతి సహజంగా పని చేస్తూ అన్నింటా రాణిస్తూ విద్యాభ్యాసం చేయాలని విశ్వ మానవత వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. సోమవారం పందలపాక, కొంకుదురు ప్రభుత్వం ఉన్నత పాఠశాల వద్ద మానవత ఆశ్రమం లోల్ల, కొంకుదురు ఉచిత ఆరోగ్య యోగ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మన పని, మనం చేసుకుంటూ యోగ సాధన, పెరటి తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయం, చెట్లు పెంచడం, సమాజం సేవ వంటివి ప్రతి విద్యార్థులు జీవితంతో భాగం కావాలన్నారు. ఉచిత హోమియోపతి వైద్య అందించారు. ఈ కార్యక్రమంలోని మానవత ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పెదపూడి: ఈ నెల 20వతేదీ నుంచి 24 వరకు అనపర్తిలో జరిగిన స్కూల్‌గేమ్స్ కబడ్డీ అండర్-14, 17 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు జి.మామిడాడ జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ విషయం ఆ పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. కబడ్డీ అండర్-14 విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న జి.సంధ్య, కె.సత్యవేణి, ఏడో తరగతి చదువుతున్న కె.కృష్ణవేణి, కబడ్డీ అండర్-17 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న టి.లాస్య, కె.చైత్ర, ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.ప్రవల్లిక ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పీడీ కె.తులసి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొన్ని గంటల వ్యవధిలో బాలుడి ఆచూకీ



బుద్దాల శ్రీరామ్

రాజానగరం: తండ్రిపై ఉన్న ప్రేమ ఆ బాలుడిని ఇంటి నుంచి పారిపోయేలా చేసింది. అయితే పోలీసులు సకాలంలో స్పందించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గాలింపు ముమ్మరం చేయడంతో ఉదయం అదృశ్యమైన ఆ బాలుడి ఆచూకీని సాయంత్రానికే కనుక్కున్నారు. కన్నవారి ఆందోళనను తీర్చారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని తోకాడ ఎస్.జ్యోతి స్కూలులో ఆరో తరగతి చదువుతున్న బుద్దాల శ్రీరామ్(12) సోమవారం ఉదయం స్కూలుకి వెళ్లేందుకు నిరాకరించాడు. దీంతో తల్లి మందలించింది. ఆ కోపంలో స్కూలుకి వెళుతున్నానని బయటకు వచ్చేసిన ఆ బాలుడు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న తండ్రి వద్దకు పయనమయ్యాడు. విషయం తెలియని తల్లి, బంధువులు స్కూలు నుంచి శ్రీరామ్ రాలేదని ఫోన్ రావడంతో కంగారు పడి పరిసరాలన్నీ గాలించారు. చివరకు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలుడు అదృశ్యమైనట్టుగా కేసు నమోదు చేశారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆ బాలుడు ఆచూకీని తెలుసుకునేందుకు వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సాయంత్రాని కల్లా ఆ బాలుడు హైదరాబాద్ వెళ్లినట్టుగా తెలుసుకుని, కన్నతల్లి భయాందోళనను తొలగించారు.

ఇందుకు సంబంధించి స్థానిక సీఐ పి.ప్రసన్న వీరయ్యగౌడ్‌ని సంప్రదించగా తండ్రిని చూడాలనే ఆరాటంలో ఆ బాలుడు (శ్రీరామ్) ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయాడన్నారు. గత రెండు రోజులుగా నాన్న వద్దకు వెళ్తానంటూ తల్లితో అనేవాడని, అయితే ఆ మాటలను ఆమె పెద్దగా పట్టించుకోలేదన్నారు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లకుండా గొడవ చేసి, ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆ బాలుడు రాజానగరం నుంచి రాజమండ్రి వెళ్లి, అక్కడ నుంచి రైలులో సికింద్రాబాద్ వెళ్లాడన్నారు. అక్కడ రైల్వే స్టేషను నుంచి బయటకు వచ్చి తండ్రికి ఫోన్ చేయడంతో ఆచూకీ తెలిసిందన్నారు. వెంటనే అతని తండ్రితో కూడా మాట్లాడి, సురక్షితంగా తండ్రిని కలుసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కడలి వెంకటేశ్వరరావు మృతి

మాజీ ఎంపీ మార్గాని భరత్, డాక్టర్ గూడూరు శ్రీనివాస్ సంతాపం



కడలి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ : రాజమహేంద్రవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ప్రముఖ బీసీ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు(52) హఠాన్మరణం చెందారు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్ సీపీలో చురుకైన నాయకుడిగా, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ కీలక అనుచరుడిగా వ్యవహరించారు. ఆయన మరణాన్ని వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రతి ఏటా శెట్టిబలిజ, గౌడ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి ఆయన ఎంతో కీలక పాత్ర పోషించేవారు. పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఆర్థిక సాయం అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తిని స్వచ్ఛందంగా వదిలేసి 2014 ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి మార్గాని భరత్‌రామ్ ముఖ్య అనుచరుడిగా పనిచేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితర నాయకులు హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కడలి వెంకటేశ్వరరావు మృతదేహాన్ని స్థానిక రెహమత్ నగర్‌లో ఉన్న ఆయన నివాసానికి తరలించారు. మంగళవారం రాజమండ్రిలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.



కడలి వెంకటేశ్వరరావు (పాతచిత్రం)

అర్జీలు పరిష్కరించేందుకు కృషి

- జిల్లా ఎస్పీ నరసింహకిషోర్
- పోలీస్ పీజీఆర్ఎస్‌కు 39 ఫిర్యాదులు



అర్జీదారుల నుంచి సమస్యను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నిర్దేశ సమయంలో అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక ×పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం¥ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 39 ఫిర్యాదులు అందాయి. వినతులను పరిశీలించి సరైన సమయంలో పరిష్కరిస్తామన్నారు. పోలీసు 'పీజీఆర్ఎస్' కార్యక్రమానికి 39 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, దొంగతనం కేసులు, ఇతర కేసులకు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్(ఎస్‌బి) అనసూరి శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ అలీ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో హోటల్స్, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్ట్స్, మొబైల్ క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు లభించడం లేదనే వివిధ మాధ్యమాల ద్వారా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈట్ రైట్ కాంపెయిన్ పేరిట తనిఖీలు చేపడుతున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం తెలిపారు. నగరపాలక సంస్థ శానిటరీ సూపర్ వైజరు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో 3 కమిటీలు నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇప్పటి వరకూ అపరిశుభ్ర వాతావరణం ఉన్న 10 హోటళ్లకు నోటీసులు జారీ చేసి, నుంచి రూ.17,500ల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.